# శాంతి

కె. చెల్లయ్య

కంగ్రాచ్యులేషన్స్ సార్! శుభదినం. ఎటువంటి రోజండీరోజు..ఎస్. కె. సి. యివ్వాలి సార్" అన్నాడు సూపర్నెండెంటుతో.

అంతా సస్పెన్స్‌లో వున్నారు. గోపీనాధ్‌తో సహా. మరల చెప్పాడు— "శుభవార్త చెప్పేస్తున్నానండీ! రాధాదేవి అనే అమ్మాయిని మన సెక్షనుకు పోస్టు చేస్తున్నారు."

గోపీనాధ్‌కు మనస్సు కాస్త తేలిక పడింది. "సూపర్నెండెంటుగారూ నా బాధ వదలిపోతుందండి. వార్కి రాగానే ఛార్జి యిచ్చేస్తాను. ఏమంటారు?" అని అడిగాడు.

పాపం అతను రెండు నెలలబట్టి యింకొకరి పనికూడా చేస్తున్నాడు. చాలా కష్టపడవలసి వస్తూంది. మొదట ఆనంద్‌ను చేయమంటే నిరాకరించాడు "తన పనే చేయడానికి తీరికలేదాయే" అనుకొని. జీవితంలో చింతించనంతగా యిప్పుడు చింతిస్తున్నాడు. గోపీనాధ్‌మీద అసూయ కల్గింది.

"గోపీ నేను హేండోవర్ చేస్తాన్లే నీకు కాస్త పని తగ్గుతుంది" స్వార్థంతో, ఆరాటంతో అన్నాడు.

"మిష్టర్ ఆనంద్ నేను చెప్పిన పనిచేసారా! అని సూపర్నెండెంటు అనడంతో నీరుకారిపోయాడు.

ఆ సెక్షన్‌లో మొదటిసీటు గోపీనాధ్‌ది కావటం మూలాన రాధాదేవి వచ్చి "సూపర్నెండెంటుగారెవరండీ" అని అడిగింది.

గోపీనాధ్ చెప్పాడు. "థాంక్సండి" అంది చిరునవ్వుతో. ఆనంద్‌ముఖం ఆముదం తాగినట్లుంది. గోపీనాధ్ తప్ప అంతా ఆమెను తదేకంగా చూస్తున్నారు. బ్రహ్మచారులు బ్రహ్మదేవుని కొనియాడుతుంటే, శ్రీవార్లు శ్రీమతులతో పోల్చి చూసుకుంటున్నారు.

అంతా తనవంక చూస్తున్నారని గ్రహించినా, రాధాదేవి గోపీనాధ్‌తో అంది— "క్షమించండి. సూపర్నెండెంటుగారు మీనుండి ఛార్జి తీసుకోమన్నారు."

గోపీనాధ్ చార్జి యిస్తూంటే, ఆనంద్ తన మెదడుకు బ్రాటీఛార్జి యిస్తున్నట్లనిపించింది. అందులో వారిద్దరిపేర్లు బాంధవ్యానికి సరిపడడంతో బాధాకరంగా వుంది. అయినా తప్పదు: చేతులారా చేసుకున్నది. చెవులారా వింటున్నాడు రాధాదేవి మాటలు. "మీ పేరేమిటండీ. . . . నాకంతా కొత్తండి. అలవాటు పడేవరకూ ఏమీ అనుకోకుండా నాకు సాయపడాలి."

రాధాదేవి చురుకైనది, తెలివైనది అవే గోపీనాధ్‌ను ఆశ్చర్య పర్చాయి, ఆనందింపచేసాయి.

ఆ అతివ అరమరిక లేకుండా చేస్తూండటం, తెలియనివి గోపీనాధ్‌ను అడగటం. తనను గుర్తించక పోవటం భరింపరానిదిగావుంది ఆనంద్‌కు,

రాధాదేవి— చేరిన మర్నాడు ఆఫీసు ఆవరణలో ఆనంద్ ఒక వనితవైపు వక్రచూపులు చూడటం గమనించింది. అప్పుడే ఆనంద్‌పై అభిప్రాయమేర్పరచుకుంద. యిక తోటి ఆడవారిని చూసింది.

ఒక్కొక్కళ్ళ చేతుల్లో పెద్దపెద్ద "వానిటీబేగ్స్" అవి ఎందుకా అని మొదట అబ్బురపడింది. తరువాత అందులోని సామాన్లు చూసుకొని నవ్వుకుంది.

ఒకరోజు అనుమానం వచ్చి రాధాదేవి గోపీనాథ్‌దగ్గరకు వచ్చి "ఈ రిజిష్టర్ ఎలా క్లోజ్ చెయ్యాలండీ" అని అడిగింది.

ఆ రిజిష్టర్ చాలాపెద్దది. రాధాదేవి ప్రక్కనే కూర్చుంది.

ఆనంద్ మనసు కుమిలిపోయింది_ఒకటే ఆలోచన_ అశాంతికి నిలయమైన అతని మనస్సు పరిపరి విధాల పరుగెడుతుంది. ఏవో ఆలోచనలు; అర్థం పర్థం లేదు . . . ఎవరైనా విన్నా హేళన చేస్తారు. తనంతతానే పరికించుకుంటే అసహ్యం పడ్తుంది. కాని ఆనంద్ ఆ స్థితిలో లేడు. ఆఫీసుపనిపై లగ్నం కుదరడం లేదు. సదా ఆమె గురించే ఆలోచనలు. వాటి ఫలితం, గమ్యస్థానం అంటూ అతనికే తెలియదు. పరిణయం కోసం తాపత్రయం లేకపోయినా, పరిచయ భాగ్యంకోసం మనసు, తనువు తహతహలాడుతున్నాయి.

యింటిదగ్గర యిల్లాలితో సరిపడటంలేదు. మనసు నిశ్చలంగా లేనికారణంగా "ఆదేమిటి అలా వుంటున్నారని" ఆరా తీయడానికి ఆప్యాయంగా ప్రయత్నిస్తే కసురుకుంటాడు. ఎవో ఎత్తిపొడుస్తాడు, సాధిస్తాడు. ఆమె కలవరం చెందేది ఈ మార్పుకు కారణం ఆమెకు అంతుపట్టలేదు. దానితో మనసు కల్లోలమైపోయింది. దుఃఖించేది. విధిని నిందించకుండా వుండలేక పోయేది. ఆమె ఎవరి మనుగడపై ఆధారపడిందో, వారిచే నిరీక్షింప చేసుకుని నిత్యం సుఖశాంతులు పొందవలసింది పోయి నిర్లక్షింప బడుతూండటం భరింపశక్యం గాకుండా వుంది. అంతకంటె సంసారస్త్రీకి అశాంతి కలుగజేసే వాస్తవిక కారణ మేముంటుంది?

ఆనంద్‌కు ఆర్థికంగా పర్వాలేదు. కుటుంబ విషయాలు అంతకంటె మెరుగు. వుద్యోగంలో "ప్రమోషన్" తలపెట్టే అవకాశం అప్పుడేలేదు. మరిక దేనికోసం అంతయిదిగా వుంటున్నారో తెలియక, ఆఖరికి నిర్ధారణ చేసుకుంది పరస్త్రీ కోసం పరితపిస్తున్నారని. ఆ నిర్ణయం చేసుకున్న ఆమె అణువణువునా అశాంతి వ్యాపించింది; అసహ్యం జనించింది.

ఒకరి కారణంగా ఒకరు _ ఆనంద్, అతని భార్యకూడా సుఖశాంతులు, మనస్థిమితం లేకుండా బరువుగా రోజులు గడుపుతున్నారు.

గోపీనాథ్ ఇప్పుడే వస్తానని చెప్పి బయటకు వెళ్ళాడు.

రాధాదేవి గది పరికిస్తుండగా, గదికి అవతల ఒక అమ్మాయి చదువుకుంటూండటం చూసింది. ఆ ముగ్ధను చూసి మురిసిపోయింది_ సహజానికి విరుద్ధంగా, ఆ మురిపెంలో మునిగిన రాధాదేవి అనేక ఆలోచనలు. ఆడ_మగ _ భార్య భర్త. అంతే. . .

ఆనంద్‌ను తను గమనిస్తూనే వుంది_ తన వీక్షణాలకోసం ప్రాకులాడుతున్నాడు. అతను తండ్రి అని తను అడుగగా గోపీనాథ్ చెప్పాడు. ఆనంద్ ప్రవృత్తి తనకు మొదటే తెల్సింది. అతను రాను రాను తనకోసం తహతహ లాడుతున్నాడు. విచక్షణా రహితంగా, తనపై అసహ్యం అంతగాలేకపోయినా, అతనికి తనలాంటి ఆడది ఒకరు భార్యగా వున్నారని జాలి ఎక్కువ. పరిచయంకోసం అనేకసార్లు అనవసరంగా జోక్యం చేసుకుంటున్నాడు. సినిమాకు రమ్మనమని ఆహ్వానించాడు. వీటికన్నిటికి ప్రోద్బలం అతని స్వార్థం. తనపై అనురాగం _ కాదు, వాంఛ. మరి అతని అర్ధాంగి . . . పిల్లలు? వాళ్ళకు యితనివల్ల కలిగే సుఖం? అది లేకపోయే . . . . ప్చ్! డబ్బున్నవాళ్ళకు సుఖశాంతులుంటాయా! అ

వుండేది కోరికలు అతితక్కువగా ఉన్నవాళ్ళకే. మరి అటువంటప్పుడు భర్త కారణంగా భార్యకూడా అశాంతికి గురి కావలసిందేనా! లేక తన భర్త నైజం గ్రహించి మార్చగలుగుతుందా.... లేదా తనూ పెడ ద్రోవ.... ఏమిటీ ఆలోచన. కళ్ళ వెంట కన్నీటి బొట్లు రాలుతున్నాయి.

అప్పటికి కొద్ది క్షణాల క్రితం వచ్చిన గోపీనాథ్ రాధాదేవి వైఖరి చూసి ఆశ్చర్యపోయి, చక్షువులలో అశ్రువులు తిలకించి బిత్తరపోయి "అదేమిటండీ రాధాదేవిగారూ ఏమైంది" అని పలకరించాడు.

తేరుకుని—"ఏమీలేదు కూర్చోండి" అంది. కొద్దిసేపాగి చెప్పసాగింది. "నా మనస్సు సున్నితమైనదనితెల్సు గాని, పెడద్రోవలు పట్టేనని ఎప్పుడూ అనుకోలేదు. చూడండి— ఆనంద్‌గారి విషయమే. నే నెటువంటిదాన్నో మీకు తెల్సు. అలాగే మీరెటువంటి వారో నాకు బాగా తెల్సు.— కారణం మీరు పురుషులు. నేను ధనవంతురాలిని. అది మీకు తెలియదు. కాని డబ్బువల్ల నాకు సుఖశాంతులు అంతగా లేవు. కారణం నా మనస్సు. నా మనసు ఎప్పుడూ అంతా సుఖంగా నవ్వుతూ వుండాలని కోరుతూంటుంది. కాని, నా మనసుని ఆవరించిన శరీరం స్త్రీ ఆకృతి, అందమైనది కావడం వల్లనేమో, నా కంతగా శాంతిలేదు. అటువంటి వాళ్ళందరకూ యిలానే వుంటుందని నేననను. మరల యిక్కడకూడా నాకు అశాంతి లభ్యమయింది. నా కారణంగా ఆనంద్...

మధ్యలో "మీరేం చేసారు...?" అని ఏదో అనబోతుండగా ఆదోరకంగా నవ్వుతూ "బలే వారండీ నేనంటే నాశరీరం... అంటే నాఅందం. అది కేవలం నా తప్పిదం అనలేను. కాని కొంత వరకూ నేను బాధ్యురాలినేమో అని నా మనసు పీకుతూంటూంది. ఆనంద్ వివాహితులు. భార్య ఎంత రూపవతో నేనెరుగను. ఎంత రూపవతి అయినా, యింకొక స్త్రీ ఏకాన్త అందంగా వున్నా వాంఛ కలుగడం దురదృష్టం. నాపై ఆనంద్ ఆలోచన మీకు తెల్సునని నాకు తెల్సు. నాపై కోరిక ఎందుకు కల్గాలి.... ఒక్కమాట— మీ వ్యక్తిత్వాన్ని కని, యిది మీదగ్గర చర్చిస్తున్నానంతే— మగవారైనా నా కారణంగా అశాంతికి ఎందుకు గురికావాలి! వారి కారణంగా వారి భార్య..., తమ కూతురి కాపరం సరిగాలేదని వారి తల్లిదండ్రులు.... ప్చ్ నావల్లే అంటారా! నా కారణంగా యింకొకరికి ఏమాత్రం కష్టం కలిగినా నా మనస్సుకు శాంతి అనేది వుండదు. అది లేకపోతే నాకు జీవించడం దుర్లభం.

ఆమెను మూర్తిలా చూస్తున్నాడు గోపీనాథ్. ఆమె చెప్పింది నిజమే. తనకు ఆమె గురించి బాగా తెలియదు, కారణం స్త్రీ.

మరల అదే స్వరంతో అంది. "భగవంతుని దయవల్ల ఈ బారినుండి తప్పుకోవా లనుకుంటున్నాను. యిటువంటిది మరల ప్రత్యక్షంగా సంభవించకుండావుంటే బాగుండును. మీకు శ్రమిచ్చాను" అని ముగించింది.

పది నిమిషాలు కూర్చున్నాక "వస్తానండీ" అని చెప్పి గది బయటకు వచ్చి క్రితం చూసిన అమ్మాయి కోసం అటూయిటు చూసింది.

రాధాదేవి మనసులో ఆనంద్ విషయం సదా మెదులుతూనే వుంది. అది తనకు చాలా విసుగు నైరాశ్యం కలుగజేస్తూంది. తనవల్ల కొంతమందికి అశాంతి కలుగడం తనకే అదోలా వుండి. తను దానికి ఏవిధంగానూ కారకురాలు కాదు.... అయినా... ఒక తోటి మానవుడు, సహోద్యోగి, అంతకంటె తనలాంటి ఒకస్త్రీ అతనికి భార్య. అతనికి ఒక బాలిక: ఆ పాప జీవితం సుఖశాంతులతో గడపాలి... అటువంటి వారికి ఆనంద్ లభించాడా! వారి భావి జీవితాలు అతనిపై ఆధారపడి వున్నాయి. తలిదండ్రి గుణగణాలు మంచివై వుండాలి...

అయినా తనంత మానసిక బలహీనతకు గురెందుకు అవుతుంది . . . . భరింపలేకుండావుంది. ఆనందును తన మనస్సునుండి తొలగించాలి . . . అప్పుడే తన మనసుకు ప్రశాంతి.

ఆఫీసుకు వెళ్ళి రాధాదేవికి ఆనంద్‌ను చూస్తే ఒక అభిప్రాయం ఏర్పడింది. అతనికి తననుచూస్తే గావి గడుపుట దుర్లభం. అది ఈ బాంధవ్యంలోనే మునగడం వల్లేనా ? అటువంటి ఆసక్తి యింకొక బాంధవ్యంలో జనించదా ? ఏమైనా అతనితో యీ రోజు సంభాషించాలి– అనుకుంది.

లంచ్‌టైం అయింది. రాధాదేవి సెక్షన్‌లో కూర్చుని టిఫిన్ చేయాలనుకుంది. కాని బుద్ధి పుట్ట లేదు. ఆమె వుంటుందికదా అని ఆనంద్ వుండిపో యాడు. యింకెవరూ సెక్షన్‌లో లేరు. ఆ అవకా శం తీసుకుని రాధాదేవి ఆనంద్ దగ్గరగా వెళ్ళి "ఆనంద్‌గారూ యీ రోజు సాయంత్రం మీతో అవ సరంగా మాట్లాడాలి తప్పకుండా రావాలి" అంది మామూలుగా.

అనుకోని చనువు, మాటలు, అందులో ఒంట రిగా మాట్లాడాలంటే అతనికి ఆశ్చర్యం, ఆనందం కలుగజేసాయి. విజయగర్వం అతనిముఖంలో తాండ విస్తుంది. మనసు ఆరాటపడసాగింది. హాయిగా వూపిరి పీల్చుకోగలిగాడు యిన్నాళ్ళకు.

సాయంత్రమయింది. రాధాదేవి ఆనంద్ వంక చూసింది. అలా తనంతట తాను చూడటం అతని మనోభిప్రాయానికి బలం చేకూర్చింది. యిన్నాళ్ళు . . . లేకపోతే ఏమిటీ . . . అనుకు న్నాడు.

యిద్దరూ టాంక్‌బండ్ వైపుకు దారితీసారు. దారిలో రాధాదేవిని ఆనంద్ పలుకరిస్తూ, పరిహా సంగా, అనురాగంగా ఏవో మాటలు అంటున్నాడు. యింకొంత సేపు భరించాలని ఓపికపట్టింది. యిద్దరూ ఒక బెంచీమీద కూర్చున్నారు.

రాధాదేవి అంది "ఆనంద్‌గారూ, నేను చిన్న దానినైనా చెప్పేది శాంతంగా, జాగ్రత్తగా ఆలకిం చండి, మధ్యలో ఆపవద్దు. ఆవేశానికి గురికావద్దు."

రాధాదేవి గంభీరముద్రయై చెప్పసాగింది– "చూడండి – యీ నిమ్న జగత్తులో నిత్యకృత్యాలు అనేక రకాలు. ఆ నిత్యకృత్యాలు చేసుకోలేని నికృష్ట జీవులుకూడా వున్నాయి. కారణం రెండు, ఒకటి– శారీరకంగా అశక్తులు కావడం; రెండు– అనేక కోరికలతో సతమతమవడం. రెండవ రకం వారు చాలామంది. మన జీవితకాలం బహు స్వల్పం. యవ్వనకాలం నిముషాలమీద జరిగిపోయినట్లనిపి స్తుంది. యవ్వనంలో వాంఛలు వుద్భవించడం, వుద్రేకపడటం, వున్మత్తులు కావడం మూడూ జరుగ కూడదు. ప్రతీవారికి తీయని వాంఛలు జనించడం అవి ఆనందదాయకంగా జరగాలని కోరికగా వుండ టం సహజం, ఆలోచన మీలో పూర్తిగా నశించింది. క్షమించండి . . . ఏమాత్రం ఆలోచన వున్నా మీరు నాపై అంతగా మోజుపడి వుండరు. నా మౌనమే మిమ్మల్ని ప్రోత్సాహిస్తే నా తప్పు కాదు. బాధ్యత కలవారు కనుక ఆలోచన అనేది వుంటుందను కున్నాను. మీ జీవిత భాగస్వాములున్నారు. వారి గురించి ఆలోచించారా ? మీ ప్రవర్తన మీదే. మీరు పరస్త్రీ లోలురని తెలిస్తే ఆ స్త్రీ ఎంతగా దుఃఖించి అశాంతి పొందుతుందో మీరు ఆలోచించారా ?

యిక నా విషయం ఆలోచించండి– నాకూ కొన్ని ఆశలు, ఆశయాలు అనేవి వుంటాయి. దానికి నేను ప్రాకులాడుతాను, నెరవేర్చుకుంటాను. నాకూ భర్త, పిల్లలు వుండాలని వుండదంటారా? మీ తుచ్ఛ వాంఛకు ఆహుతి అయితే నా ఆశయం ? యీ విష యం పూర్తిగా మీకే వదిలేస్తున్నా సంగ్రహంగా

చెప్పి. "నన్ను సోదరిగా చూడండి" అని లేచి వెళ్ళిపోయింది.

యింటికి ఎలాగో చేరుకున్నాడు. అర్ధాంగి బ్రతిమలాడినా, ఆ అతివ అన్న మాటలకు అన్నం సహించడంలేదు . . . ఒకటే ఆలోచన. వెల్లకిలా పడుకుని నిశితంగా నిశ్చలంగా ఆలోచిస్తున్నాడు . . . అలా ఎంత సేపు ఆలోచించాడో . . .

"ఆదేమిటండీ . . . ఆరోగ్యం పాడవ్వదూ. ఎంత రాత్రయిందో చూడండి . . . నా మాట విని పడుకోండి . . . ఏమైనా కావాలా ?" ఎంతో అనునయంగా అడిగింది.

ఆనంద్ ప్రతీ అణువు కదిలిపోయింది. కొంత సేపటికి మనసు నిర్మలమైంది." చూడు విమలా నేనిన్నాళ్ళు అనవసర, అనాలోచిత, అమర్యాదకరమైన ఒక కార్యాన్ని సాధించాలని సతమతమయ్యాను. తప్పు నా అంతట నేను తెల్సుకోలేకపోయాను. యిప్పుడు చాలా హాయిగా, తేలికగావుంది నా మనసు_ ఆఁ_ ఒక్కటి కావాలి . . . రేపు మా ఆఫీసునుంచి నా చెల్లాయిని తీసుకువస్తాను. నీవు హృదయపూర్వకంగా స్వాగత మివ్వాలి. . . ." అని కళ్ళలోకి చూసాడు.

నిముషాలమీద అంతా గ్రహించిన విమల సర్దుకుని, ఆనందంగా" అంతకంటేనాండీ, పండుగగా భావించి, నా ఆడబడుచుకు ఆనందం చేకూర్చనూ" అంది_